పాదయాత్రతో ప్రజల జీవితాల్లో వెలుగు

- పేదల కష్టాలు తెలుసుకునేందుకే వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర
- అధికారంలోకొచ్చిన మూడున్నరేళ్లలోనే 98 శాతం హామీలు అమలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టా రేణుక
- పాదయాత్ర పూర్తయి నాలుగేళ్లయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో సంబరాలు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, చిత్రంలో మాజీ ఎంపీ బుట్టారేణుక

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర చరిత్రాత్మకమని, ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదల కష్టనష్టాలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్ 2017 నవంబరు 6 నుంచి 2019 జనవరి 9 వరకు వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు దాదాపు 14 నెలల పాటు 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో 134 నియోజకవర్గాల్లో పర్యటించి 124 సభలు ఏర్పాటు చేశారని, కర్నూలు జిల్లాలో 18 రోజుల పాటు 263 కిలో మీటర్లు తిరిగారని వెల్లడించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చి పేదల బతుకులు మార్చేందుకు నవరత్నాల పేరుతో పలు పథకాలు తీసుకొచ్చారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛన్ల పెంపు ఫైలుపై తొలి సంతకం పెట్టి అమలు చేశారన్నారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆచరణకు సాధ్యం కాని 600 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా తమ వెబ్ సైట్ నుంచి తొలగించారన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ మాత్రం 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. మూడున్నరేళ్లలోనే 98 శాతం హామీలు అమలు చేసి చూపారన్నారు. అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, ఇందులో మహిళలకు 50 శాతం కేటాయించారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవులు, కాంట్రాక్ట్ పనుల్లోనూ సగ భాగం ఇచ్చి వారికి సమాజంలో గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇలా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిన తమ పార్టీ 2024లో 175 స్థానాల్లో గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం, సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ తమది పేదల ప్రభుత్వమని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, యూనుస్, రైల్వే ప్రసాద్, కర్నాటి పుల్లారెడ్డి, సత్యం యాదవ్, అక్కిమి హనుమంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, జిలానీబాషా, ధనుంజయ ఆచారి,కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతోనే అభివృద్ధి జరుగుతోందని కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక అన్నారు. ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర పూర్తి చేసుకుని నాలుగేళ్లైన సందర్భంగా సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను కళ్లార చూసి వారి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రస్తుతం పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, గాజుల శ్వేతారెడ్డి, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, మైతాపు నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, విక్రమ సింహారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, వార్డుల ఇన్‌చార్జ్‌లు సంజన్న, సాపురు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫాతిమా జయంతిని అధికారికంగా నిర్వహించాలి


కలెక్టరేట్ ఎదుట షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఆధునిక భారతదేశంలో తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా చరిత్రలో స్థానం సంపాదించిన షేక్ ఫాతిమా జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం ఆమె జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల నాయకులు భరత్‌కుమార్, నక్కలమిట్ట శ్రీనివాసులు, పట్నం రాజేశ్వరి, అధ్యాపకుడు షంషుద్దీన్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షంషుద్దీన్ మాట్లాడుతూ..సావిత్రిబాయి పూలేతో సమానంగా ఆడపిల్లల విద్య కోసం కృషి చేసిన ఫాతిమా జీవిత చరిత్రను ప్రభుత్వం పాఠ్యాంశంగా చేర్చడం అభినందనీయమన్నారు.

డీఐఓగా ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ)గా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉదయం ఇన్‌చార్జ్ డీఐఓ డాక్టర్ బాలమురళి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే అన్ని ఆరోగ్య కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్తానని, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేస్తానని చెప్పారు. ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓలు తనకు అప్పజెప్పే బాధ్యతలను తు.చ తప్పకుండా అమలు చేస్తానని తెలిపారు. ఆయనను కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని నర్సింగ్ స్కూళ్లలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్యకు ఆర్‌పీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నర్సింగ్ స్కూళ్లు రూ.500 ఉన్న పరీక్ష ఫీజును రూ.2,500 నుంచి రూ.5,800 దాకా వసూలు చేస్తున్నాయని, ఇదేమిటని ప్రశ్నిస్తే పాస్ కావాలని లేదా అని చెబుతూ ప్రాక్టికల్స్ ఫెయిల్ అవుతారని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయమై విచారణ జరిపిస్తామని డీఎంహెచ్‌ఓ హామీ ఇచ్చారని తెలిపారు.

లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ కార్యాలయం ప్రారంభం



కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద స్కంద షాపింగ్ మాల్‌లో కర్నూలు లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ సంఘం చైర్మన్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్లను రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ నారాయణ కేశవయ్య, కార్యదర్శి ఇజాజ్, సంయుక్త కార్యదర్శి చిన్ని ప్రసన్న, హమీద్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీమా కల్పించండి

కర్నూలు(సెంట్రల్): మార్కెట్ యార్డు హమాలీ కార్మికులకు రూ.10 లక్షల బీమా సదుపాయం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు. సోమవారం బుధవారపేటలో కాపురం ఉంటున్న కొత హమాలి భంగి పుల్లయ్య గుండెపోటుతో చనిపోవడంతో ఆయన నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించాలని కోరారు. కర్నూలు మార్కెట్ యార్డులో దాదాపు 1000 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు.

హమాలీ కూలి రేట్లు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై హమాలీలకు పెంచిన కూలి రేట్లను అమలు చేయాలని సీఐటీయూ సివిల్ సప్లై హమాలీల యూనియన్‌జిల్లా కార్యదర్శి బజారప్ప డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర హమాలీలు ధర్నా నిర్వహించారు. 2022 జనవరిలో సివిల్ సప్లై హమాలీ కూలీల రేట్లను ప్రభుత్వం రూ.22 నుంచి రూ. 25 కు పెంచినట్లు చెప్పారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన జీఓ విడుదల చేయలేదన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్ ,ఒక్కడు, 18 పేజెస్ , ధమాకా, మైఖేల్ గ్యాంగ్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : 18 పేజెస్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, ధమాకా, ఏ జర్నీ టు కాశి, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనోసార్స్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ధమాకా ,మైఖేల్ గ్యాంగ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : ఒక్కడు
రాజ్ :ధమాకా
శ్రీరామ: ఒక్కడు
విజయ : 18 పేజెస్

వినతుల పరిష్కారానికి చర్యలు

- స్పందన కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కర్నూలు (టౌన్): నిర్ణీత గడువులోగా ప్రజా వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వివిధ సమస్యలపై మునిసిపల్ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ నగర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరపాలక డిప్యూటీ కమిషనర్ రమాదేవి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు వినతులు స్వీకరించారు.

వినతుల్లో కొన్ని..

- నగరపాలక సంస్థ పరిధిలోని గీతానగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నామని, వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన జగదీష్ అనే వ్యక్తి అధికారులను కోరారు.
- తమ కాలనీలో మురుగు నీటి సమస్య వేధిస్తోందని శ్రీశైలం దేవస్థానం ఎంప్లాయీస్ కాలనీకి చెందిన శ్రవణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.
- తమ కాలనీలో ఏర్పాటు చేస్తున్న పెద్ద మురుగు కాల్వల డిజైన్లను మార్చాలని రిచ్మండ్ విల్లాస్ కాలనీకి చెందిన ప్రకాష్ బాబు కోరారు.
- రాధనగర్, రేణుకానగర్‌లలో రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆ ఏరియాకు చెందిన దస్తగిరి అర్జీ ఇచ్చారు.
- టిడ్కో పట్టాను తన భార్య పేరున మార్చాలని వెంకటేశ్వర నగర్‌కు చెందిన దాసు కోరారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు

కర్నూలు (టౌన్): మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. సోమవారం ఆయన నగరంలోని ఓల్డ్ ఈద్గా, కొత్తపేట ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మోటార్ వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడుపుతున్న 24 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ. 36,840 జరిమానా విధించారు.

మహనీయుడు ఎన్టీఆర్

కర్నూలు(టౌన్): 35 సంవత్సరాల కాంగ్రెస్ పాలనను పారద్రోలి 1983 సంవత్సరం జనవరి 9న తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పని తీరు మార్చుకోకపోతే చర్యలు

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల పనితీరుపై అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల పని తీరుపై వస్తున్న ఫిర్యాదులపై ఏడీ సోమవారం తన కార్యాలయంలో సమీక్షించారు. నిత్యం ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారని, అయితే, చాలా మంది ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రతి ఉద్యోగి ఏ రోజు ఎన్ని ఫైల్స్ క్లియర్ చేశారో కూడా తెలియడం లేదన్నారు. ఒక ఫైల్ రాసేందుకు కొందరు రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారన్నారు. ఇకపై అలా చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంతర్జాతీయ సదస్సుకు జిల్లా వాసి


ఆచార్య వెంకటేశులు

కర్నూలు సిటీ: అమెరికాలోని డెన్వర్ రాష్ట్రంలో గల సుప్రసిద్ధ కొలరాడో విశ్వవిద్యాలయంలో ఈనెల 12 నుంచి నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం జిల్లాకు చెందిన ప్రొఫెసర్‌కు దక్కింది. ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నె గ్రామానికి చెందిన ఆచార్య ఇ.వెంకటేశులు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం ఆచార్యులుగా పనిచేస్తున్నారు. '75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై ఆయన కొలరాడో విశ్వవిద్యాలయంలో తన పరిశోధన పత్రాన్ని సమర్పించి ప్రసంగించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు ఉన్న ప్రొఫెసర్లు హాజరయ్యే సదస్సులో తనకు పాల్గొనే అవకాశం వచ్చిందని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గోదాదేవి ఆలయ సందర్శన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలో వెలసిన గోదా గోకులాన్ని శాసన సభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, విశ్రాంత ఐఏఎస్, తిరుమల తిరుపతి దేవస్థానముల సంయుక్త కార్యనిర్వహణాధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు సందర్శించారు. శ్రీరంగంలో కొలువైఉన్న శ్రీరంగనాథుడిని పోలిన ఆలయాన్ని నిర్మించిన తీరును చూసి నిర్వాహకులను అభినందించారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త ఆలయం గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించుకుందాం


మొక్క నాటుతున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ

కర్నూలు కల్చరల్: కలిసికట్టుగా ప్రకృతిని పరిరక్షించుకుందామని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సాయిగోపాల్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక క్లస్టర్ యూనివర్సిటీలో మొక్కలు నాటారు. ఈ సందర్భగా వీసీ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకొని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మానవతా పర్యావరణ కమిటీ చైర్మన్ వీర ప్రతాప్, వైస్ చైర్మన్ చంద్రశేఖరరావు, సభ్యులు యుగంధర్ శెట్టి, శ్రీనివాసులు, బాషా, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి

కర్నూలు (టౌన్) : డాక్టర్ త్రినాథ్ కిక్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 8 వ తేదీ నిర్వహించిన జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు డిగ్రీ కళాశాల (పురుషుల) విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కళాశాలకు చెందిన బి.ప్రసాద్, తిప్పయ్య, చంద్రశేఖర్ ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పాయింట్స్ ఫైట్ 63 కేజీల సీనియర్స్ బాలురు విభాగంలో వంశీ (ప్రథమ), హరికళ్యాణి(ద్వితీయ), భరత్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అలాగే ఈనెల 6 వ తేదీ కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి శాప్ అథ్లెటిక్స్ లీగ్ టోర్నమెంట్‌లో బీఏ విద్యార్థిని చంద్రప్పగారి దేవి 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాలలోని తన చాంబర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి అభినందించారు.

అన్నదానం పుణ్యఫలం


ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు, దాతలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని శ్రీశైల దేవస్థాన సత్రంలో శివ దీక్షా పరులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గత 23 సంవత్సరాలుగా భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయమనోహరి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఎస్వీ మాట్లాడుతూ రెండు దశాబ్దాల నుంచి విజయవంతంగా అన్నదాన కార్యక్రమం కొనసాగించడం అభినందనీయమన్నారు. దాతలకు మహా శివుని ఆశీస్సులు ఎల్ల వేళలా ఉంటాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆర్య నరసింహులు, సభ్యులు రవి గౌడ్, గోవింద రాజులు, చెన్నకేశవులు, శేఖర్, సర్వేశ్వరరెడ్డి, మల్లికార్జున, రాజశేఖర్, కంటు, వెంకటేశ్వర్లు, యోగి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కూడారై సేవ

ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో సోమవారం కూడారై సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, గోదాదేవీని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నప్పటినుంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తే రక్తహీనత, పౌష్టికాహార లోపం సమస్యలకు చెక్ పెట్టవచ్చని న్యూట్రిషన్ రిసోర్స్ సెంటర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఎన్ఆర్‌సీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల పరిధిలో రక్తహీనతతో బాధ పడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో కర్నూలు సీడీపీఓ అనురాధ, సూపర్‌వైజర్ అనూష పాల్గొన్నారు.

పీఈటీలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కర్నూలు (టౌన్) : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో వస్తున్న సాంకేతికతను వ్యాయామ ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా యాప్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల విద్యలో వ్యాయామ విద్యను ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక ధృఢత్వాన్ని ఖేలో ఇండియా ,ఫిట్ ఇండియా యాప్స్‌లో నమోదు చేసేందుకు సాంకేతికతను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా ఉపవిద్యాధికారి హనుమంతరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ముద్రించిన 2023 నూతన సంవత్సర డైరీని పీఆర్ పర్యవేక్షక ఇంజనీరు కె. సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. రవీంద్రారెడ్డి, ఆర్. సతీష్ కుమార్, కోశాధికారి ఆర్ పార్థసారథి, ఉపాధ్యక్షుడు హెచ్‌డీ ఈరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ముద్రించిన డైరీలో ముఖ్యమైన సమాచారాన్ని పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో పీఐయూ, పీఆర్ఐ ఈఈలు రామకృష్ణారెడ్డి, మద్దన్న, డీఈఈలు రమేష్‌కుమార్‌రెడ్డి, శిల్పాశ్రీ, చౌడేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


లవకుశ నాటకంలోని ఓ సన్నివేశం

ఆకట్టుకున్న లవకుశ


సురభి కళాకారుడిని సన్మానిస్తున్న మేయర్ రామయ్య

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో సురభి కళాకారుల ప్రదర్శన కొనసాగింది. రెండోరోజు సోమవారం కళాకారులు ప్రదర్శించిన లవకుశ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య ప్రారంభించి ప్రసంగించారు. కళాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి, వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కళాక్షేత్రంలో చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలి రావడాన్ని చూస్తే పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గలేదని నిరూపితమవుతుందన్నారు. అనంతరం సురభి కళాకారులతో ప్రదర్శించబడిన లవకుశ నాటకం ఆకట్టుకుంది. శ్రీరామ పట్టాభిషేకం, రాక్షస మాయలు, పక్షుల విహారం, యుద్ధ సన్నివేశం, లవకుశల ఆశ్రమ విద్యాభ్యాసం వంటి ఘట్టాలు అలరించాయి. అనంతరం సురభి శివశంకర్‌ను మేయర్ సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉత్సవాల కన్వీనర్ బాలవెంకటేశ్వర్లు, సమితి ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు రాజారత్నం, వాల్మీకి రాముడు, సురభి సరేష్ , యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి


దీక్షను ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్ ఎన్ రసూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హాస్టల్ విద్యార్థులకు వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు. పాతబడిన భవనాల స్థానంలో కొత్తవాటిని నిర్మించాలన్నారు. సన్నబియ్యం సరఫరా చేయాలని, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపిన ఈ దీక్షలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శరత్‌కుమార్, అల్తాఫ, థామస్, విజయేంద్ర రంగస్వామి, ఈరేష్, శ్రీరంగ, ఈశ్వర్ తదితరులు దీక్షలో కూర్చున్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

- జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు
- ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంసాపత్రాలు


ఉత్తమ వైద్య సేవలు అందించిన వైద్యురాలికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్):ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు చెప్పారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ 21వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లాలో నెలకు రెండు సార్లు 104 వాహనం ద్వారా వైద్యులు గ్రామంలో ఇంటింటికి తిరిగి సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు, బాలింతలకు, శిశువులకు, రక్తహీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ సమస్యలున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులను మరింత ప్రోత్సహించేందుకు, ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి నెలా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖల అధికారులు ప్రజలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ నెలలో ఉత్తమ సేవలు అందించిన గార్గేయపురం పీహెచ్‌సీ డాక్టర్ హేమలత, హుసేనాపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. శైలజకుమార్, పోలకల్ పీహెచ్‌సీ వైద్యులు హరిశ్చంద్రుడు, తుగ్గలి పీహెచ్‌సీ వైద్యులు ద్రాక్షాయిని, కమ్మరిచేడు పీహెచ్‌సీ వైద్యులు సుమితలకు ఉత్తమ సేవలు అందించిన వారిగా ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, ఫ్యామిలీ ఫిజిషియన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బాలమురళి, డీపీఎంఓలు సుబ్రహ్మణ్యం, ప్రకాష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మండలాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి, పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.